సాక్షి
చిత్తూరు
సోమవారం । 4 । మార్చి । 2024



గరిగదొనలో జల్లికట్టు జోష్

కోడెగిత్తల రంకెలు, యువత కేరింతల మధ్య వెదురుకుప్పం మండలం గరిగదొనలో జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. - 8లో



నేడు ప్రారంభోత్సవాలు

కాణిపాకంలో సోమవారం మంత్రుల చేతుల మీదుగా పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. - 8లో



పల్లె వాకిట్లో ఫ్యామిలీ డాక్టర్

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

రెండు చుక్కలతో నిండైన జీవితం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: రెండు పోలియో చుక్కలు నిండైన జీవితాన్ని ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. స్థానిక పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఆమె పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పోలియో రహిత దేశంగా భారతదేశానికి తీర్చిదిద్దాలన్నారు. పోలియో వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి కనుక ఐదేళ్ల పిల్లలకు తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా దగ్గర్లోని కేంద్రాలకు తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయించాలన్నారు. గతంలో ఎక్కువ మంది పోలియో బారినపడి దివ్యాంగులయ్యేవారన్నారు. పోలియో చుక్కలు వేయించడంతో నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, వైద్యాధికారి రమేష్, కార్తిక్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో రద్దీ



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. దీంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకొని భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4న కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ జాషువా ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



బోయకొండలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, జంతు సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో రద్దీ పెరగడంతో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకొన్నారు.



ఆలయంలో భక్తుల రద్దీ

ఈ ఐదేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు... నవరత్నాలతో పేదల సంతోషాలు.. ఇవన్నీ ఆ నేతలకు కంటగింపుగా మారినట్టుంది. ప్రజారంజకంగా సాగుతున్న జగనన్న పాలనలో ఇమడలేకపోయారు. రాజకీయ అనుభవాలను రంగరించుకుని చెలరేగిపోయేందుకు కొందరు యత్నించి చతికిలపడ్డారు. మరికొందరు వైఎస్సార్‌సీపీ చరిష్మాతో కొత్తగా వచ్చిన పదవిని అనుభవించుకోలేక తికమకపడ్డారు. ఎంతసేపు స్వార్థరాజకీయాల కోసమే పరితపించారు. తమకు గుర్తింపునిచ్చిన పార్టీని వీడాలని నిశ్చయించుకున్నారు. మేకవన్నె పులిలాగా తమ గెలుపునకు పనిచేసిన నేతలు, కార్యకర్తలకు ద్రోహం చేస్తూ.. ఇతర పార్టీల నేతలకు మంచి చేయడం ప్రారంభించారు. దీన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలను పక్కనబెట్టింది. స్వార్థపరులు దూరమవడంతో అసలుసిసలైన కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి పెనుభారమైన వారు బయటకెళ్లడంతో ఆనందంలో మునిగితేలుతున్నారు.



కక్షగట్టి.. ముప్పతిప్పలు పెట్టి

ఎమ్మెల్యేలు అయ్యాక ఆనం రామ్‌నారాయణరెడ్డి, ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, వరప్రసాద్, ఎంఎస్ బాబు తమ విజయం కోసం పనిచేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులను పక్కన పెట్టేశారు. అంతేగాకుండా వారిపై కక్షగట్టి ముప్పుతిప్పలు పెట్టారు. తమ ఓటమి కోసం పనిచేసిన ఇతర పార్టీల వారిని పిలిచి మరీ పక్కన పెట్టుకుని రాక్షసానందం పొందారు. చివరకు వీరు ప్రజాసేవ చేయకుండా, స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేయడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ప్రజాభిమానాన్ని చూరగొనలేని ఆ ఐదుగురి స్థానంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా ఇన్‌చార్జ్‌లను నియమించారు.

వీళ్లింతే!



- గెలుపు కోసం పనిచేసిన వారిని ఇబ్బంది పెట్టారు
- ఓటమి కోసం పనిచేసిన వారిని పక్కన పెట్టుకున్నారు
- ఆ ఎమ్మెల్యేలకు దూరంగా ఉన్న శ్రేణులంతా హ్యాపీహ్యాపీ
- పార్టీకి నమ్మకద్రోహం చేసిన ఎమ్మెల్యేలంతా అజ్ఞాతంలోకి వెళుతున్న వైనం

సాక్షి, తిరుపతి: ఎలాంటి గుర్తింపూ లేని వారు కొందరికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి మరీ టికెట్లు ఇచ్చారు. గత రాజకీయ అనుభవాలు ఉన్న నేతలు మరింత ఎదగాలని, వారి అనుభవాలను పంచుకోవాలని చేయిపట్టుకుని నడిపారు. గత ఎన్నికల్లో అన్నీ తానై ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారు. ఆ తర్వాత ప్రజారంజక పాలన కోసం ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవ్వాలని సూచనలు చేశారు. అందుకోసమే గడపగడపకు మన ప్రభుత్వం, మీ ఊరికి మీ ఎమ్మెల్యే.. అంటూ పలు పథకాలకు శ్రీకారం చుట్టారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలని ఆదేశాలు జారీచేశారు. ప్రతి నెలా సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలకు సంసిద్ధం చేశారు. కార్యకర్తలు, నేతలను కలుపుకుపోయి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశాలు జారీచేశారు. తరచూ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలు.. సంక్షేమ పథకాలపై దిశానిర్దేశం చేశారు. కానీ అవేవీ ఆ నేతలకు చెవికెక్కలేదు. తమ స్వార్థ రాజకీయాల కోసం పక్క పార్టీల వైపు చూసి తప్పటడుగులు వేస్తున్నారు...చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని చిత్తూరు, పూతలపట్టు, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు. ఇప్పుడు పక్క పార్టీలోనూ సరైన గుర్తింపులేదని కొందరు.. ఎలాగైనా చక్రం తిప్పొచ్చని మరికొందరు ఊహల్లో తేలుతున్నారు. ఇలాంటి నేతలు బయటకు వెళ్లడమే మంచిదని అసలు సిసలైన కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వార్థం..తప్పదు అజ్ఞాతం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో 2019లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రజలకు సేవచేయలేక, నమ్మిన వారికి వెన్నుపోటు పొడిచి ఇతర పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. తల్లిలాంటి పార్టీ దగ్గర ఛీకొట్టించుకుని ఇప్పుడు టీడీపీ, జనసేన నాయకుల కాళ్లవేళ్లా పడుతున్నారు. వైఎస్సార్‌సీపీపై బురదజల్లేందుకు ఎదురుచూస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలు ముందుగా వారికి మాయమాటలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయిస్తున్నారు. ఇటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న టీడీపీ, జనసేన అధినేతలు ఆ ఎమ్మెల్యేల ద్వారా పబ్బం గడుపుకున్నాక టికెట్ కేటాయింపు విషయంలో పేచీపెడుతున్నారు. పొత్తులో భాగంగా బాబు, పవన్‌లు ఒకరికి తెలియకుండా ఒకరు అన్నట్టు సీట్లు ప్రకటించేస్తున్నారు. మరికొన్ని చోట్ల కిమ్మనకుండా నమ్మకద్రోహులైన ఎమ్మెల్యేలను మరింత దూరం పెడుతున్నారు. వారి అసలు రంగు బయటపడడంతో తప్పుచేశాం.. అని తన ముఖ్య అనుచరుల వద్ద కొందరు ఎమ్మెల్యేలు మదనపడుతున్నారు. మరికొందరు తమను నమ్ముకున్న ప్రజలకు ముఖం చూపించలేక అజ్ఞాతంలోకి జారుకుంటున్నారు.

గుచ్చుకుంటున్న పక్కచూపులు !

ఆడలేనమ్మ మద్దెల ఓడు అన్నట్టు ప్రజారంజక పాలనలో ఇమడలేని నమ్మకద్రోహులైన ఎమ్మెల్యేలు మొదట టీడీపీ నేతలతో టచ్‌లోకి వెళ్లారు. అక్కడి నుంచి సరైన స్పందన లేకపోవడంతో జనసేన అధినేతను కలిశారు. ఆ తర్వాత టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటిస్తున్న నేపథ్యంలో ఆనం మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. చిత్తూరు టీడీపీ అభ్యర్థిగా ఎన్ఆర్‌ఐ గురజాల జగన్ మోహన్(జేజీఎం)ను ప్రకటించడంతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొన్ని రోజుల పాటు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఎలాగూ పొత్తులో భాగంగా జనసేనలో ఉంటే చక్రం తిప్పవచ్చన్న ఉద్దేశంతో ఆదివారం ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. తిరుపతి అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని వేడుకున్నట్టు తెలిసింది. ఎన్నికల తర్వాత అయినా పార్టీలో కీలక పదవి ఇప్పించమని ప్రాధేయపడినట్టు ప్రచారం జరుగుతోంది. నమ్మక ద్రోహులు వెళ్లిపోవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా ఎంఎస్‌ఎంఈల సర్వే



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమ)ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన క్షేత్రస్థాయి అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న దాదాపు 60 వేల ఎంఎస్‌ఎంఈల సర్వేలను ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు సర్వే రిపోర్టులను డీఐసీ జెడ్‌ఎంకు పంపాలని ఆదేశించారు. సర్వే చేసేటప్పుడు ఏవైనా సందేహాలుంటే (నగరి, పలమనేరు, కుప్పం) 9849944553, శ్రీధర్ (చిత్తూరు, జీడీ నెల్లూరు) 7093631370, ఓబులేశు (పూతలపట్టు, పుంగనూరు) 8985089837ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. మ్యానుఫాక్చరింగ్, సర్వీస్‌తో పాటు వ్యాపార, వాణిజ్య సంస్థల సర్వేను చేపట్టాలని తెలిపారు. దీనికి ఎంఎస్‌ఎంఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోషియేషన్లు, వర్తక వాణిజ్య సంఘాలు సహకరించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 70,442 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,867 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.60 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

మద్దికుంట చెరువుకు కృష్ణా జలాలు



హంద్రీ నీవా కాలువ ద్వారా రామకుప్పం మండలం మిట్టపల్లి గ్రామంలోని మద్దికుంట చెరువుకు కృష్ణా జలాలు చేరాయి. దీంతో ఆదివారం స్థానిక రైతులు ఆ జలాలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కృష్ణా జలాలను విడుదల చేసిన ఐదు రోజుల్లోనే మద్దికుంట చెరువుకు నీరు చేరింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ, నాయకులు, రైతులు రామిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శివశంకర్, మధు పాల్గొన్నారు. – రామకుప్పం

పల్స్ పోలియో 97 శాతం పూర్తి

- 2,01,447 మందికి చుక్కల మందు
- మరో రెండు రోజులపాటు ఇంటింటికీ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకే చుక్కల మందు పంపిణీ మొదలైంది. 1491 కేంద్రాలు, 1088 సంచార బృందాలు ప్రణాళిక ప్రకారం చుక్కలు వేశారు. సాయంత్రానికి 97.24 శాతం పూర్తయింది. ఐదేళ్లలోపు పిల్లలు 2,09,971 మందికి గాను 2,01,447 మందికి చుక్కలు వేశారు. మిగిలిన పిల్లలకు వైద్య సిబ్బంది సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.



చుక్కలు వేస్తున్న మేయర్ అముద, అధికారులు

పోలియో రహిత సమాజమే లక్ష్యం

పోలియో రహిత సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మేయర్ అముద తెలిపారు. నగరంలోని టెలిఫోన్ కాలనీలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రారంభించారు. పిల్లలకు చుక్కలు వేసి మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలకు కచ్చితంగా చుక్కలు వేయించాలన్నారు. వంద శాతం లక్ష్యం పూర్తికావాలన్నారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, జిల్లా టీకా అధికారి రవిరాజు మాట్లాడుతూ పిల్లలందరికీ చుక్కల మందు వేయడం ద్వారా పోలియో సంపూర్ణ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. తొలిరోజు చుక్కలు వేసుకోని పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి వేయాలన్నారు. కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, టీబీ అధికారి వెంకట ప్రసాద్, అధికారులు లోకేష్, శిరీష పాల్గొన్నారు.

ముందస్తు కసరత్తులో నిమగ్నం

సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఈ పనుల్లో కలెక్టరేట్ యంత్రాంగం తలమునకలై ఉన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఎలాంటి పొరబాట్లు లేకుండా నిర్వహించేందుకు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. ముందస్తు ఏర్పాట్ల వివరాలను డ్రాఫ్ట్ రూపంలో పంపాలని ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ ఏర్పాట్లపై సాక్షి కథనం.

- ఈసీకి డ్రాఫ్ట్ వివరాలు పంపే ఏర్పాట్లలో యంత్రాంగం
- రూరల్‌లోనే అధికంగా పోలింగ్ కేంద్రాలు
- డ్రాఫ్ట్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ (ఫైల్)

జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు ఇలా

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు	1762
జిల్లాలోని ఓటర్లు	15,58,257
అర్బన్‌లోని పోలింగ్ కేంద్రాలు	362
రూరల్‌లోని పోలింగ్ కేంద్రాలు	1400
వెయ్యికంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలు	574
ఎన్నికలకు అవసరమైన పోలింగ్ పర్సనల్స్	10,572

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం వేగం పెంచింది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈవీఎంలు, వీవీప్యాట్ల తనిఖీలు పూర్తి చేశారు. ఈవీఎంలను భద్రపరిచే గోదాములను పరిశీలించారు. కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగం పెంచారు. ఏ సమయంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ కసరత్తును కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల కసరత్తు ఏర్పాట్లపై డ్రాఫ్ట్ నివేదికను పంపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లను ఆదేశించింది. ఆ నివేదికలను పంపేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.

అధికారుల బదిలీలు

బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే జిల్లాలో రెవెన్యూ, ఇతర శాఖల్లో పనిచేస్తూ ఎన్నికలతో సంబంధం ఉన్న అధికారుల బదిలీలను చేపట్టారు. ఇటీవల రెవెన్యూ, పోలీసు, జెడ్పీ బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒకేచోట మూడేళ్లు, అంతకన్నా ఎక్కువ కాలం పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. చేపడుతున్న కసరత్తుపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీలతో ప్రతి వారం సమావేశం నిర్వహిస్తున్నారు. కసరత్తును వివరించి, వారి నుంచి సలహాలు, ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తున్నారు.

1,762 పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,762 పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు ఏర్పాటు చేస్తున్నారు. ఆ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో రూరల్ ప్రాంతంలోనే అధికంగా ఉన్నాయి. అర్బన్‌లో 362, రూరల్‌లో 1,400 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వెయ్యి మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో 574 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 17 షాడో జోన్‌లలో, 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు.

ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఆరుగురు

పోలింగ్ పర్సనల్స్ ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్‌లలో ఒక్కొక్క కేంద్రానికి ఆరుగురు చొప్పున పోలింగ్ పర్సనల్స్‌ను నియమించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను పోలింగ్ పర్సనల్స్‌గా వినియోగించనున్నారు. 1762 పోలింగ్ కేంద్రాలకు ఆరుగురు చొప్పున 10,572 మంది అవసరమవుతుందని అధికారులు ప్రాథమిక నివేదికల్లో పేర్కొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేలా..



"షెడ్యూల్ ఎప్పుడూ ఇచ్చినా సమర్థవంతంగా, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ ముందస్తు కసరత్తు చేపడుతున్నాం. తుది ఓటర్ల జాబితా ఇటీవల విడుదల చేశాం. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. పకడ్బందీగా ఎన్నికల నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. – షణ్మోహన్, కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు



ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ముందస్తుగా కసరత్తు చేయడం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులను పరిశీలిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం నుంచి వచ్చే ఉత్తర్వులను పరిశీలించి కసరత్తు చేస్తున్నాం. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు కేటాయించిన తహసీల్దార్ పోస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశాం. – శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

నేటి నుంచి హాల్‌టికెట్ల పంపిణీ



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఈ నెల 4వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల హాల్‌టికెట్‌లు సోమవారం మధ్యాహ్నం నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆయా పాఠశాలల లాగిన్‌లతో పాటు విద్యార్థులు సైతం హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ఉన్నతాధికారులు కల్పిస్తున్నారని డీఈఓ తెలిపారు.

గరిగదొనలో జల్లికట్టు జోష్



దూసుకుపోతున్న కోడె గిత్తలు

వెదురుకుప్పం : మండలంలోని మాంబేడు పంచాయతీ దిగువ గరిగదొన గ్రామంలో ఆదివారం జల్లికట్టు జోష్ తెచ్చింది. కోడెగిత్తల రంకెలు, యువత కేరింతల మధ్య ఎద్దల పందేలు సందడిగా సాగాయి. ఎద్దలకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా యువత నిలబడడంతో నిర్వాహకులు ఎద్లను ఉసిగొల్పారు. దీంతో రంకెలేస్తూ దూసుకుపోతున్న ఎద్లను నిలువరించి, పలకలను దక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. కొందరు పలకలను దక్కించుకుని విజయగర్వంతో చిందులేశారు. ఎద్ల పందేలను చూసేందుకు పరిసర గ్రామాల నుంచి వచ్చిన జనంతో వీధులన్నీ కిక్కిరిశాయి.

పల్లె వాకిట్లో ఫ్యామిలీ డాక్టర్

- మారుమూల ప్రాంతాలకు చేరువైన వైద్య సేవలు
- గ్రామాల్లోని దీర్ఘకాలిక రోగులకు శ్రీరామరక్ష
- ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్న వైనం



సవటపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది



కొండకింద యల్లంపల్లెలో వృద్ధుడికి ఇంటి వద్దే సేవలు అందిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోనూ మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు, ప్రభుత్వ డాక్టర్‌తోపాటు సిబ్బంది 104 వాహనం ద్వారా వచ్చి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. గతంలో మారుమూల ప్రాంత ప్రజలు పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం భారంగా ఉండేది. దానివల్ల రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే సేవలు

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. వీటితోపాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలో ఐరాల పీహెచ్‌సీ, చిగరపల్లె పీహెచ్‌సీ ఉంది. రెండు పీహెచ్‌సీ పరిధిలో నలుగురు డాక్టర్లు, 26 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో రోజుకు సగటున 230 మంది రోగులకు చొప్పున వైద్య సేవలు అందిస్తున్నారు.

67 రకాల మందులు

ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలకు 104 వాహనం ద్వారా వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. ఇందులో ముఖ్యంగా హెచ్‌బీ, బ్లడ్ గ్రూప్ హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్, వీడీఆర్‌ఎల్, గర్భనిర్ధారణ, యూరిన్, షుగర్ తదితర పరీక్షలతో కలిపి 46 రకాల పరీక్షలు చేస్తారు. కొత్త వైద్య విధానంలో భాగంగా ఇంటి వద్దకే పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వైద్యుల సూచనల మేరకు రక్తపరీక్షలు చేపడతారు. అనారోగ్య సమస్యలను గుర్తించి బాధితులకు అప్పటికప్పుడే ఉచితంగా మందులు అందజేస్తున్నారు. 104 వాహనంలో 67 రకాల మందులు సిద్ధంగా ఉంటాయి. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, వైద్య రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాముఖ్యతపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజలకు మెరుగైన వైద్యం

పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తోంది. నిధుల మంజూరు, విడుదల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీలేని నిర్ణయాలు తీసుకోవడంతో ప్రభుత్వాస్పత్రుల్లోనే కార్పొరేట్ వైద్యం ప్రతి ఒక్కరికీ చేరువవుతోంది. దాదాపు 4 వేల వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాలోనూ వైద్యసేవలు పొందే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాడు- నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఏళ్ల తరబడి ఖాళీ ఉన్న వైద్య, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేశారు.

ముందస్తు సమాచారంతో



ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ వచ్చి ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా 104 వాహనం నెలలో ఏ రోజు వస్తుందో ముందుగానే సమాచారం అందిస్తున్నారు. అదే రోజు మేము వెళ్లి వైద్యసేవలు పొందుతున్నాం. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.
– మునిరాజులు, కామినాయనపల్లె, ఐరాల

అందుబాటులో వైద్యం



మా గ్రామానికి నెలకు రెండు సార్లు 104 వాహనం వస్తోంది. బీపీతోపాటు ఇతర సమస్యలను డాక్టర్ పరీక్షించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. అంతేకాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. దీని ద్వారా ప్రతి ఒక్కరికీ గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. – వనజ, వీఎస్.అగ్రహారం, ఐరాల

మారుమూల ప్రాంతాలకు ఉపయోగం



ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల మారుమూల గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగం. ఇకపై ఆయా గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.
– సురేంద్రయాదవ్, గొల్లపల్లె, ఐరాల

రోజుకో గ్రామంలో వైద్య సేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి రోజూ ఒక గ్రామానికి వెళ్లి సేవలందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, పాఠశాలల్లో వైద్య కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల పరీక్షలు, చికిత్స, రక్తహీనత పరీక్షలు, ప్రసూతి ఆరోగ్య సంరక్షణ సేవలు, బాలింత ఆరోగ్య సంరక్షణతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు.
– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

నేడు ప్రారంభోత్సవాలు



వినాయక సదన్‌లో నిర్మిస్తున్న గదులు



నూతనంగా నిర్మించిన లడ్డూపోటు

కాణిపాకం (యాదమరి): కాణిపాక స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా లడ్డూపోటు పడితరంస్టోర్, వినాయక సదన్‌లో 2, 3 అంతస్తు భవనాల్లో గదులు, 100 అడుగుల రోడ్డు, గోశాల ప్రహరీ గోడ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ భవన యంత్రానికి ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వీరాంజనేయస్వామి ఆలయం, వినాయక క్యూ కాంప్లెక్స్, నిత్య అన్నప్రసాద భవనం, స్నానపు ఘట్టం, అతిథి గృహ నిర్మాణం, స్వామివారి 100 అడుగుల విగ్రహం, ప్రహరీ గోడలకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రులు కొట్టు సత్యనారాయణ, నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఫుట్‌బాల్ క్రీడకు ప్రోత్సాహం



క్రీడాకారులను సత్కరిస్తున్న క్రీడా శాఖ మంత్రి రోజా

పుత్తూరు: రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. నగరిలోని మంత్రి కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర, అంతర్రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన ఫుట్‌బాల్ క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ నగరి నియోజకవర్గం నుంచి అంతర్రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారులు తయారుకావడం హర్షణీయమన్నారు. నగరి నియోజకవర్గంలో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పుత్తూరు ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.జయప్రకాష్, కోచ్ నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర, ప్రసాద్, దిలీప్, సలీమ్, జాఫర్, గణేష్, గోపి, అలీ తదితరులు పాల్గొన్నారు.

పాడి ఆవులు మృతి



మృతి చెందిన ఆవులను పూడ్చిపెడుతున్న రైతు

బైరెడ్డిపల్లె: మండలంలోని మిట్టకుర్రపల్లె గ్రామంలో ఆదివారం బంగాళదుంప ఆకులు తిని మూడు పాడి ఆవులు మృతిచెందాయి. గ్రామానికి చెందిన నాగరాజు ఆవులు 2, ఈశ్వర్‌కు చెందిన ఒక ఆవు గ్రామ సమీపంలో ఉన్న బంగాళదుంప పంట ఆకులను తినడంతో అప్పటికప్పుడే కుప్పకూలాయి. బంగాళదుంప పంటకు మితిమీరిన రసాయనిక ఎరువులు వాడకం వలన ఆవులు మృతి చెందినట్లు రైతులు భావిస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నాయకుల చేరిక



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో పలమనేరు ఎమ్మెల్యే వెంకటెగౌడ



వెంకటేష్‌పురంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

వి.కోట: మండలంలో 40 కుటుంబాల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని బోయ చిన్నాగన పల్లి(బీసీ పల్లి)కి చెందిన టీడీపీ నాయకులు పార్టీలో చేరడంతో ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్య నాయకులు ఆదిమూర్తి, వసంత్ కుమార్, మునిరాజా, శోభన్‌బాబు, మునితర్నం, జానకిరాం, వెంకటేష్ వారి అనుచరులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు, జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, కులం, మతాలు, రాజకీయాలకు అతీతంగా కొనసాగిస్తున్న పాలనను చూసి పార్టీలోకి వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి ఎప్పటికీ మోసం చేయదని, జగనన్న ఇచ్చిన మాటమీద నిలబడే తత్వమే నేడు ప్రజలు జగనన్న వైపు నిలుస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి మాటల్లో కాదని స్వయంగా చేసి చూపుతున్నామన్నారు. సంక్షేమ పాలన ఇలాగే కొనసాగాలంటే మరో సారి జగనన్నను గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, సింగిల్ విండో ఛైర్మన్ గోపిరెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌పురంలో..

శాంతిపురం/రామకుప్పం: దాదాపు 20 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శాంతిపురం మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ వెంకటేష్‌పురానికి చెందిన సావిత్రమ్మ, మురుగేష్, కృష్ణమూర్తి, చెంగమ్మ, చంద్రమ్మ, నటరాజు, ఆంజమ్మ, కోమల, చంగ్రాయుడు, రమణమ్మ, భూదేవి, రామచంద్ర తమ కుటుంబాలతో సహా గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రామకుప్పం మండలం బల్లలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన శంకర్, వేణు, శివ, మురుగన్, సి.శంకర్ కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి ఎమ్మెల్సీ భరత్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఇతర పార్టీలకు చెందిన తమపై ఎలాంటి వివక్ష చూపకుండా జగనన్న సంక్షేమ పథకాలను అందించటంతో తాము స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు.

గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం



విజయ్‌కుమార్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పలమనేరు: సముద్రతీరాన విహారానికి వెళ్లి రాకాసి అలలకు బలైన పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు లభ్యమైనట్టు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.విజయశేఖరం ఆదివారం తెలిపారు. ఇక్కడి కళాశాలకు చెందిన 18 మంది తమిళనాడులోని మహాబలేశ్వరానికి విహారానికి వెళ్లారు. వీరిలో బంగారుపాళెం మండలం కేసీ కండ్రిగకు చెందిన విజయ్ మృతదేహం శనివారం లభించింది. గల్లంతైన మరో ఇద్దరు మౌనిష్, ప్రభుల మృతదేహాలను ఆదివారం అక్కడి జాలర్లు, కోస్టల్ గార్డులు గుర్తించినట్టు ఆయన తెలిపారు.

విద్యార్థికి అంత్యక్రియలు

బంగారుపాళెం: మహాబలిపురం బీచ్‌లో గల్లంతైమృతి చెందిన విద్యార్థి విజయ్‌కుమార్ మృతదేహాన్ని ఆదివారం బంగారుపాళెం మండలంలోని కేసీ కండ్రిగకు తీసుకు వచ్చారు. కుమారుని మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పలువురు ప్రజా ప్రతినిధులు విజయ్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.